సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 17-3-2025

సంపుటి: 20 సంచిక: 300

పేజీలు: 8 వెల: రూ.1


## చలో ఢిల్లీకి తరలిరండి!

**పిలుపునిచ్చిన శిష్టకరణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డబ్బీరు శ్రీనివాసరావు (వాసు)**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చే విషయంపై కేంద్ర సామాజిక న్యాయశాఖామంత్రితో ఈ నెల 27న కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భేటీ కానున్న నేపథ్యంలో జిల్లాలో శిష్టకరణ నాయకులు పెద్ద ఎత్తున ఢిల్లీకి తరలిరావాలని జిల్లా శిష్టకరణ సంక్షేమ సంఘం అధ్యక్షులు డబ్బీరు శ్రీనివాసరావు (వాసు) పిలుపునిచ్చారు. పార్టీలకు, సంఘాలకు అతీతంగా నాయకులంతా ఢిల్లీకి బయల్దేరాలని ఆయన కోరారు. శిష్టకరణ సంఘ నాయకులు ఆర్‌వీఎన్ శర్మ, ఎస్‌వీడీ మురళీ, ఉరిటి కిరణ్ వంటివారంతా వస్తున్నారని, మిగిలిన నాయకులు కూడా ఆ సమయానికి ఢిల్లీలో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. చాలా రోజుల తర్వాత మళ్లీ ఓబీసీ సాధన కోసం అడుగులు పడుతున్నాయని, కింజరాపు రామ్మోహన్ నాయుడు మంత్రిగా ఉన్న కాలంలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న భావనతో ఉన్నారని, అందుకే ఆకస్మికంగా సామాజిక న్యాయ శాఖామంత్రితో ఆయన భేటీ అవుతున్నారని వాసు పేర్కొన్నారు.



పనిఒత్తిడి తగ్గించాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సర్వేయర్లు

- పరిష్కారం చూపాలని వేలల్లో దరఖాస్తులు
- గత లోపాలు సవరించని రెవెన్యూ అధికారులు
- సర్వేయర్లనే బాధ్యులుగా చూస్తున్న హక్కుదారులు
- గ్రామాల్లో ప్రారంభమైన రీసర్వే

# తప్పులతో తిప్పలు

## మళ్లీ సర్వేతో కొత్త తలనొప్పులు



సర్వే చేపడుతున్న గ్రామ సర్వేయర్లు (ఫైల్‌ఫొటో)

> “ వైకాపా హయాంలో నిర్వహించిన భూముల రీసర్వేలో వెలుగు చూస్తున్న తప్పులతో భూహక్కుదారులు తిప్పలు పడుతున్నారు. సమగ్ర భూసర్వే అంతా అయోమయంగా మారిందని విమర్శిస్తూనే రీసర్వేకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ లక్ష్యాన్ని రెవెన్యూ అధికారులే నీరుగార్చారన్న ఆరోపణలున్నా క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలకు పరిష్కారం చూపించడంలో విఫలమవుతున్నారు. ”



సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రీసర్వేలో సమస్యలకు క్షేత్రస్థాయిలో పనిచేసిన గ్రామ సర్వేయర్లను బాధ్యులుగా భూహక్కుదారులు చూస్తున్నారు. చనిపోయిన వ్యక్తికి పాస్‌బుక్ రావడం, రైతు పేరు, భూమికి సంబంధించి సర్వే నెంబర్, భూమి స్వభావం, వర్గీకరణ తప్పుగా నమోదు కావడం, జిరాయితీ భూమి ఇనాం భూమిగా నమోదయ్యాయి. ఉమ్మడిగా సాగు చేసుకుంటున్న భూమిని విభజించకుండానే జాయింట్ ఖాతాగా పెట్టడం, కొన్నిచోట్ల డి-పట్టా భూములను జాయింట్ ఎల్‌పీఎంగా చూపించారు. వివాదాలు ఉన్న భూములను పరిష్కరించకుండా భూ-హక్కు తెలియని ఖాతాగా నమోదు చేశారు. రైతులకు క్షేత్రస్థాయిలో భూమి ఉన్నా వేరే వ్యక్తుల పేర్లతో హక్కుల పత్రాలు ఆన్‌లైన్‌లో రావడం, భూవిస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, ఒకే భూమిపై ఇద్దరికి హక్కుపత్రాలు ఇవ్వడం వంటి అనేక సమస్యలు గ్రామస్థాయిలో గుర్తించారు. వీటిని పరిష్కరించాలని గ్రామసభల్లో భూసమస్యలపై వచ్చిన అర్జీలు అన్నీ ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాల వీఆర్వోలకు వాటిని పరిష్కరించే బాధ్యతను అప్పగించారు. అయినా ఇప్పటికీ పరిష్కారం చూపించలేకపోతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే కొనసాగించాలని నిర్ణయించింది. దీంతో పాత సమస్యలకు పరిష్కారం చూపించకుండా కొత్త సమస్యకు అవకాశం కల్పిస్తున్నట్టు అవుతుందని భూహక్కుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రెవెన్యూ అధికారులు, సిబ్బంది చేసిన తప్పులకు గ్రామ సచివాలయం సర్వేయర్లను బాధ్యులుగా రైతులు చూస్తున్నారు.

### 738 రెవెన్యూ గ్రామాల్లో సర్వే

రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి వైకాపా హయాంలో అధునాతన సాంకేతిక పరికరాలతో భూ రీసర్వే ప్రక్రియను 2020 నవంబర్‌లో ప్రారంభించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,680 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. జిల్లాలో 1,465 రెవెన్యూ గ్రామాలకు గాను 738 గ్రామాల్లో సర్వే పూర్తిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ వివాదాలపై గ్రామసభలు, రెవెన్యూ గ్రామసభల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 3.8 లక్షల ఫిర్యాదులు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా నమోదయ్యాయి. జిల్లాలో 30,669 ఫిర్యాదులు అందాయి. రీ-సర్వేలో భూ వివాదాలకు, తప్పులకు గత ప్రభుత్వంలో ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంతో పాటు అధునాతన సాంకేతిక పరికరాలపై కేవలం విలేజ్ సర్వేయర్లకు మాత్రమే శిక్షణ ఇచ్చి మిగతావారిని విడిచిపెట్టేశారు. రీసర్వేపై రెవెన్యూ సిబ్బందికి పూర్తి అవగాహన, శిక్షణ లేకపోవడం, గ్రామం విస్తీర్ణం బట్టి రీసర్వే చేపట్టడానికి గడువు ఇవ్వకపోవడం, గ్రామ సర్వేయర్లపై ఒత్తిడి తేవడంతో తప్పులు దొర్లాయి. రీ-సర్వే పూర్తయిన తర్వాత భూ యాజమానులు అభ్యంతరాలు తెలిపేందుకు 60 రోజుల గడువు ఉండేది. అయినా వాటిని రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు.

### ఆర్డర్స్ లేకుండానే రీసర్వే..

రీ-సర్వేను ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు (ఎస్‌ఓపీ) ద్వారా డిప్యూటీ తహశీల్దార్లను రీసర్వే స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌లుగా 2021 జూన్ 7న

- మిగతా చివరి పేజీలో

# విద్యావ్యవస్థలో మేలుమలుపు!

- పథకాలకు మహామహుల పేర్లు
- రాజకీయ పార్టీల రంగు పడకుండా చర్యలు
- పాఠశాల విద్యార్థుల యూనిఫారాల మార్పు
- విద్యారంగంలో సంస్కరణల పర్వం


డి.కల్పన, ఎంఎస్సీ బీఈడీ, ఎంఏ లిటరేచర్

కల్మషం లేని చిన్నారి మనసుల్లో భేదభావాలు, వైషమ్యాలు నాటుకుపోకుండా ఉండేందుకు ప్రాథమిక విద్యాభ్యాసం స్థాయి నుంచే ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకుంటున్నాయి. పేద, ధనిక, వర్ణ, కుల, మత తారతమ్యాలు వారి దరి చేరకుండా పాఠశాలల్లో అందరూ ఒకేలా కనిపించేలా, కలిసిమెలిసి చదువుకునే వాతావరణం ఏర్పరిచేవి. కానీ కాలక్రమంలో రాజకీయ అధికారం వెర్రితలలు వేస్తూ విద్యాసంస్థలను కూడా రాజకీయ విషవలయంలోకి లాగుతూ చిన్నారి విద్యార్థుల మనసుల్లోకి రాజకీయ విషం చొప్పించే చర్యలకు పాల్పడటం అనుభవైకవేద్యం. విద్యార్థులకు అమలు చేసిన పథకాలకు జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక వంటి పేర్లు పెట్టడం, పాఠశాలలకు అధికార పార్టీ పతాకాన్ని పోలిన రంగులు వేయించడం వంటివి విద్యాసంస్థలను రాజకీయ రొంపిలోకి లాగడమేనన్న విమర్శలు వెల్లువెత్తాయి. కానీ దీనికి పూర్తి విరుద్ధంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. వీటిలో ఎటువంటి రాజకీయ వాసనలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటుండటం హర్షించదగ్గ పరిణామం. రాష్ట్ర మానవ వనరుల శాఖ(విద్యా శాఖ) మంత్రిగా వ్యవహరిస్తున్న నారా లోకేష్ విద్యారంగ నిపుణులతో చర్చిస్తూ ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ వరకు సంస్కరణలు ప్రవేశపెడుతున్నారు.

### పథకాలకు కొత్త రూపం

గత ప్రభుత్వంలో అమలు చేసిన అన్ని విద్యారంగ పథకాలకు అప్పటి అధికార పార్టీ అధినేత పేరు పెట్టడం తీవ్ర విమర్శలకు గురైంది. దానికి మించి విద్యార్థుల మనసుల్లో రాజకీయ విషబీజాలు నాటుతుందన్న ఆందోళన వ్యక్తమైనా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. సాధారణంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి ప్రయోజనం చేకూర్చే నిర్ణయాలు తీసుకోవడం, పథకాలకు పేర్లు పట్టడం పరిపాటిగా మారింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రాజకీయాల జోలికి పోకుండా మార్పులు చేస్తోంది. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకమే దీనికి నిదర్శనం. రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టింది. ఈ పథకానికి రాజకీయపరమైన పేరు కాకుండా గోదావరి జిల్లాల్లో బ్రిటీష్ హయాంలోనే గొప్ప అన్నదానశీలిగా పేరుప్రఖ్యాతులు పొందిన డొక్కా సీతమ్మ పేరు పెట్టడం ప్రశంసలు అందుకుంది. మరోవైపు పాఠశాల విద్యార్థులకు అమలు చేస్తున్న జగనన్న విద్యాకానుక పథకంలో మార్పులు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం కింద ఇచ్చే కిట్‌లో యూనిఫారం, బెల్టు, బ్యాగు, షూస్, టై తదితర సామగ్రిలో పార్టీపరమైన రంగులు, బొమ్మలు లేకుండా







సమూలు మార్పులు చేస్తోంది. పథకం పేరుతో ప్రముఖ విద్యావేత్త, భారత ప్రథమ ఉప రాష్ట్రపతి పేరుతో.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌గా మార్చడం ముదావహం. ఇందులో భాగంగా విద్యార్థులకు ఇచ్చు యూనిఫారాన్ని మార్చాలని నిర్ణయించారు. అదేవిధంగా బెల్టులు, బ్యాగుల రంగులు కూడా ఏ పార్టీ రంగులను పోలిన విధంగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి వీటిని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని విద్యారంగ నిపుణులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షామోదాలతో స్వాగతిస్తున్నారు. కాగా ఈ అంశంలో ప్రైవేట్ విద్యాసంస్థలపై కూడా దృష్టి సారించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఏడాది, రెండేళ్లకోసారి యూనిఫారాలను ఇష్టానుసారం మార్చేస్తూ, వాటి అమ్మకాల ద్వారా వ్యాపారం చేసుకుంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లతో పాటు ప్రైవేట్ సంస్థల్లోనూ ఒకే రకమైన యూనిఫారం అమలు చేసేలా నిర్ణయం తీసుకోవాలని అనేకమంది సూచిస్తున్నారు.

## నాడు ఉత్తరాల అందజేతకు

# నేడు రాష్ట్రపతితో విందుకు!

- ఏడాదిన్నరలో ఎంతమార్పు
- ఇది ప్రజాస్వామ్యం గొప్పతనం
- ఎంపీ అప్పలనాయుడు ఆనందం



(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

ఒకప్పుడాయన రాజకీయాల్లో సామాన్యుడు. ఒకానొక అంశంలో ప్రజల నిరసనలను నిక్షిప్తం చేసిన ఉత్తరాల కట్టలను రాష్ట్రపతి భవన్‌కు చేరవేసేందుకే చాలా శ్రమపడ్డారు.

ఇప్పుడు అదే వ్యక్తి అదే రాష్ట్రపతి భవన్ నుంచి అల్పాహార విందుకు ఆహ్వానం అందుకోవడం, రాష్ట్రపతితో కలిసి అల్పాహారం స్వీకరించడం విశేషం. నాడు సామాన్య కార్యకర్తగా, నేడు ఎంపీగా ఉన్న ఆ వ్యక్తే కలిశెట్టి అప్పలనాయుడు.

నిన్నమొన్నటి వరకు తెలుగుదేశం పార్టీలో రణస్థలానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడు సామాన్య కార్యకర్తగా ఉండేవారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలతో పాటు తాను సొంతంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో తెలుగుదేశం పార్టీని నిలబెట్టేందుకు ప్రయత్నించారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును అరెస్టు చేసి జైల్‌లో పెట్టడం పట్ల ప్రజల నిరసనను ఉత్తరాల రూపంలో సేకరించిన అప్పలనాయుడు వాటిని రాష్ట్రపతికి పంపారు. ప్రజల నుంచి సేకరించిన లక్ష ఉత్తరాల కట్టలను రణస్థలం నుంచి ఢిల్లీకి అక్కడి నుంచి రాష్ట్రపతి భవన్‌కు చేర్చడానికి ఎంతో శ్రమించారు. ఎన్నో తనిఖీలను ఎదుర్కొన్నారు. అయితే అప్పట్లో తాను ఎంపీనవుతానని, ఆ హోదాలో రాష్ట్రపతి ఇచ్చే విందులో పాల్గొంటానని అప్పలనాయుడు ఏమాత్రం ఊహించలేదు. కానీ పార్టీ కోసం చేసిన కృషికి గుర్తింపుగా గత ఏడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు అనూహ్యంగా అప్పలనాయుడును విజయనగరం ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టడం, ఎన్నికల్లో ఆయన విజయం సాధించడం జరిగిపోయాయి. దాంతో కలిశెట్టి పార్లమెంటు వేదికగా తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. కాగా కొన్నిగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులకు రాష్ట్రపతి విందు ఇచ్చే సంప్రదాయం ఉంది. ఆ మేరకు రాష్ట్రాలవారీగా ఎంపీలను అల్పాహార విందుకు రాష్ట్రపతి భవన్ ఆహ్వానిస్తోంది. అందులో భాగంగా సోమవారం ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ఎంపీలకు రాష్ట్రపతి అల్పాహార విందు ఇచ్చారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా ఇచ్చిన ఈ విందులో పాల్గొన్న అప్పలనాయుడు గతంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా తాను రాష్ట్రపతి భవన్‌కు ఉత్తరాల కట్టలు మోసుకొచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ.. అదే రాష్ట్రపతి తనను నేడు విందుకు ఆహ్వానించడం ప్రజాస్వామ్యం గొప్పతనంగా వర్ణిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన పార్టీ అగ్రనేతలు చంద్రబాబు, లోకేష్‌లకు, విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజలకు అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.



• ఎడిటోరియల్

# పవన్‌ను నాయకుడ్ని చేసింది జగనే

ఏదోలా నిత్యం వార్తల్లో వుంటే ప్రజలలో క్రేజ్ తగ్గకుండా వుంటుంది అనే ఓ చిన్న ట్రిక్‌తో పవన్ తన రాజకీయాలు నడుపుతున్నారు. పార్టీ నిర్మాణం పెద్దగా లేకపోయినా గత పన్నెండేళ్లుగా బాగానే పార్టీని నడిపించేస్తున్నారు. పార్టీని నడిపే డబ్బులు లేక బాగా డబ్బున్న చిరంజీవే చేతులెత్తేసి పార్టీని కాంగ్రెస్ పార్టీలో కలిపేసి ఇచ్చిన తృణమో, ఫణమో పుచ్చుకుని బయటపడిపోయారు. అతనితో పోలిస్తే పేదవాడైన పవన్‌కళ్యాణ్ పార్టీని నడపడం కష్టమైన పనైనా బాగానే నడుపుకుంటూ వస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర కులపార్టీల లానే ఒక కుల పార్టీలా మొదలైన ఆ పార్టీ ఈ రోజు ఒక మత పార్టీగా రూపాంతరం చెందింది. ఇంత ప్రగతిని జనసేన సాధించింది అంటే.. దానికి కారణం ఆ పార్టీనీ వెన్నంటి ప్రోత్సహిస్తున్న జగన్, వైకాపా అభిమానులే. వారి అండదండలే లేకపోతే పవన్ 2019లో ఏదో ఒకచోట ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి వచ్చి అక్కడ ఏం చేయాలో తెలియక, పార్టీని నడిపే డబ్బు లేక ఎప్పుడో రాజకీయాలు వదిలేసే వుండును. తన తండ్రి సొంత పార్టీ ఎమ్మెల్యేలైన పి.జనార్ధనరెడ్డి, డి.శ్రీనివాస్‌లను ఓడించి తనకు అడ్డు లేకుండా చూసుకుంటే పాపం జగన్ పక్క పార్టీ నాయకుణ్ణి ఓడించి తనకి అతగాడు అడుగడుగునా అడ్డుతగిలేలాగా చేసుకున్నారు. ఇక జగన్ కంటే ఎక్కువగా ఆయన పార్టీ నాయకులు, అభిమానులు నిత్యం పవన్ నామస్మరణ చేసి చేసి పవన్ ఇమేజ్‌ను కొండంత ఎత్తుకు పెంచారు. ఇపుడు జగన్ క్రిస్టియన్లకి బ్రాండ్ అంబాసిడర్ అవునో కాదో తెలీదు కానీ పవన్‌ని మాత్రం హిందువులకు బ్రాండ్ అంబాసిడర్‌ని చేసేసారు. ఇది వ్యంగ్యంగా చెబుతున్న మాట కాదు, రాజకీయాల్లో శత్రువులు ఎక్కడి నుంచో పుట్టరు. తమ తప్పుడు నిర్ణయాలతో శత్రువులను ఆ నాయకులే సృష్టించుకుంటారు. ఆ రోజు సీబీఐ విజయరామారావుకి మంత్రి పదవిచ్చి కేసీఆర్‌ని తయారుచేసింది చంద్రబాబే కదా. నాలుగడుగుల రేవంత్ రెడ్డిని ఎవరెస్ట్ ఎత్తుకు పెంచింది కేసీఆర్ అండ్ కేటీఆర్ కాదూ? పాపం అక్కడ అధినాయకులు ఒక్కరివే తప్పులైతే ఇక్కడ అతనితో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాజీ అభిమానులు, ఆయన తండ్రి అభిమానులు, ఇలా ఒక్కరు కాదు, వైకాపాతో బీరపీచు సంబంధం వున్న ప్రతిఒక్కరూ పవన్ ఎదుగుదలకు శక్తిమేర తొడ్పడుతూనే వున్నారు. నిజానికి టీడీపీలో ఎవరూ పవన్ ఎదగాలి అని మనస్ఫూర్తిగా కోరుకోరు. వైకాపా వారి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో వైకాపా 'అత్యంత ప్రజాస్వామ్య' పద్ధతుల్లో ఏకగ్రీవం చేసుకునే రోజుల్లో వారికి రోడ్డు మీద ఎదురు తిరిగింది కేవలం జనసేన వాళ్లు మాత్రమే. కానీ ఈ రోజు పదిమంది టీడీపీ అభిమానుల్ని ప్రైవేట్‌గా ప్రశ్నిస్తే వారిలో పదికి పదిమందీ మా వలననే పవన్ గెలిచారు అంటారు. వారి కట్టుబాటు అది. వారితో పోలిస్తే పవన్‌ని అనునిత్యం గేలిచేస్తూ అతని ఎదుగుదలకు నిస్వార్థంగా కృషి చేస్తున్న వైకాపా అభిమానులని అభినందించక తప్పదు. పవన్ సక్సెస్ ఫార్ములా అదే. ఎలాగోలా అధికారం చేపట్టాలనే లక్ష్యంతో ప్రవర్తించిన టీడీపీ ఇప్పుడు తన చావు తాను తెచ్చుకుంటోంది. చివరకు బీజేపీకి తలొగ్గకపోతే అధికారం పోతుందనే భయంతో తానే బీజేపీలా మాట్లాడే పరిస్థితికి టీడీపీ పడిపోతోంది. ఇంతకాలం దక్షిణ భారతదేశంలో అడుగుపెట్టడానికి వీల్లేని పరిస్థితిని జయించడానికి బీజేపీకి సరైన తురుపుముక్క పవన్‌కల్యాణ్. ఇక నుంచి దక్షిణభారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో ఆయా ప్రాంతాల అధికార భాషలు ఎంతోకొంత వంట బట్టించి హిందీ పేరుతో పవన్‌కల్యాణ్‌తో పర్యటన చేయించేందుకు బీజేపీ రంగం సిద్ధం చేసుకుంది. అందుకే ఇటీవల తమళనాడు నేతల మీద పవన్‌కల్యాణ్ విమర్శలు చేసి దక్షిణాదిలో బలమైన రాష్ట్రాన్ని కెలికారు. నిజానికి ఎంతోకొంత సెక్యులర్ స్వభావం ఉన్న టీడీపీ వల్ల తమ ప్రయోజనం నెరవేరదని భావించిన బీజేపీ పవన్‌కల్యాణ్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో తన వంతు వేగాన్ని పెంచడం ప్రారంభించింది. రానున్న రోజుల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్ అవసరం తప్పనిసరి పరిస్థితి పవన్‌కల్యాణ్ ద్వారా బీజేపీ కల్పిస్తోంది. పవన్‌కల్యాణ్ సినీ అభిమానాన్ని రాజకీయ రంగు చేసి పబ్బం గడుపుకోడానికి రెండు తెలుగు రాష్ట్రాలను హిందూ ప్రయోగశాలగా మార్చడానికి చేసే ప్రయత్నాలకు అధికార ప్రతినిధిగా పవన్ కల్యాణ్ మాస్‌లోకి వెళ్లబోతున్నారు. మెజార్టీగా ఇక్కడ క్రైస్తవం హైందవ భావాలతో ప్రభావితమైవుంది. కామన్‌మేన్ ప్రొటక్షన్ ఫోరం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన కొత్తలో వరకు పవన్‌కల్యాణ్ అన్ని రాజకీయ పార్టీలను టచ్ చేస్తూ కొన్నేళ్లు కాలక్షేపం చేస్తే, ఆయన్ను పూర్తిస్థాయి రాజకీయవేత్తగా మలిచింది మాత్రం జగన్మోహన్‌రెడ్డే.

## ట్రెజరీస్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ శ్రీకాకుళం యూనిట్ ఎన్నిక ఆదివారం ఘనంగా జరిగింది. ఎన్నికల అధికారి, ఉపాధ్యక్షులు ఎం.డి. మజ్హర్ బేగ్, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు మెట్ట తులసీరావుల ఆధర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పైడి వెంకట రమణ, సహాయ అధ్యక్షుడిగా పొలుగుమతి గొగరాజు, ఉపాధ్యక్షుడిగా మీసాల రమేష్ నాయుడు, ఉపాధ్యక్షులుగా పేరాడ మన్మధరావు, మకందర్ సల్మా, కార్యదర్శిగా పుప్పాల శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా బోర శ్రీధర్, సంయుక్త కార్యదర్శులుగా చిట్టి చంద్రశేఖర్, పులి సింహాద్రి రాజు, మామిడి మీనాక్షి, కోశాధికారిగా సలాది సూర్యచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## యురేకా సైన్స్ ఎక్స్‌పో శ్రీకాకుళం జిల్లా విజేతలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మూడ నమ్మకాలు- శాస్త్రీయ దృక్పథం విభాగంలో ప్రథమ స్థానాన్ని శ్రీకాకుళం ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు కె.తేజశ్రీ, ఎస్.అనూష పొందారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రథమస్థానాన్ని రణస్థలం ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థులు ఎ.పార్థసారథి, ఎ.సాయి సాత్విక్, భరణీకుమార్, ద్వితీయ స్థానాన్ని కాశీబుగ్గ విద్యార్థులు కొంచాడ సుధీర్ పొందారు. పర్యావరణం సుస్థిరాభివృద్ధి విభాగంలో ప్రథమస్థానాన్ని పాతపట్నం విక్టరీ హైస్కూల్ విద్యార్థులు పువ్వల జస్వంత్, ఆకుల వివేక్, పి.హర్షవర్ధన్, ద్వితీయ స్థానాన్ని జి.సిగడాం మండలం జడ్పీ హైస్కూల్ డి.బండపల్లి విద్యార్థి కిల్లాన జాను పొందారు. జిల్లాస్థాయిలో ప్రథమ ద్వితీయస్థానాల్లో విజయం సాధించిన పాఠశాలల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ప్రిన్సిపాల్స్, హెడ్మాస్టర్స్, పాఠశాల యాజమాన్యాలు, ప్రోత్సహించిన సైన్సు, ఇతర ఉపాధ్యాయులకు జేవీకే శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పాలవలస ధర్మారావు, యురేకా సైన్స్ ఎక్స్‌పో నాయకులు పూజారి గోవిందరావు, ఎస్ సాయి శ్రీనివాస్ శర్మ, కొత్తకోట అప్పారావు, బొడ్డేపల్లి మోహన్ రావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, పి కుర్మారావు అభినందించారు.

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో ఆయన స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి సందర్భంగా స్థానిక గాంధీపార్క్‌లోగల ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్క్ సంరక్షకురాళ్ళకు దుప్పట్లు వాసవి క్లబ్, వనిత క్లబ్ శ్రీకాకుళం వారితో అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ పేర్ల మహేష్, పేర్ల కామరాజు, మామిడిపాక సుధాకర్, వీఎస్ఎల్ నరసింహం, అధ్యక్షులు మాటూరు దీపక్, మామిడిపాక పద్మావతి, కార్యదర్శులు మణికొండ రవి, జి.మౌనిక, కోశాధికారి మణికొండ మంజు, ఉపాధ్యక్షులు మామిడిపాక వెంకటరావు, సభ్యులు ఎం. గౌరిజయ, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పేర్ల సురేష్, మండవిల్లి ఎస్ఎస్ గుప్త, పట్నాల ఆనంద్, కాపుగంటి సంతోష్, చెన్నూరి ఉత్తమ్, మండవిల్లి లక్ష్మణ రావు మరియు తమ్మన బాలకృష్ణ పాల్గొన్నారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళంలో జిల్లాలోని నేటి నుంచి జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సోమవారం ఉదయం పరీక్ష కేంద్రాల వద్ద పరీక్ష సరళని పర్యవేక్షించారు. ఈ క్రమంలో శ్రీకాకుళం నగరంలోని గీతాంజలి హైస్కూల్‌తోపాటుగా, పరీక్షలు జరుగుతున్న పలు పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ సందర్శించి భద్రత ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పరీక్షలు జరిగే తీరును అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాలు వద్ద విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ వ్రాత పరీక్షలలో విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేల పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు విధులు నిర్వర్తించాలన్నారు. పరీక్షలు పూర్తయ్యేవరకు అధికారులు, సిబ్బంది అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. విద్యార్థులు నిర్దేశించిన సమయంలోపు కేంద్రాల లోనికి క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలన్నారు. సెల్ఫోన్లు,స్మార్ట్ వాచెస్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతికి వీల్లేదని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉన్నందున విద్యార్థులు మినహా ఇతరులను అనుమతించరాదని సూచించారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు ముగిసిన వరకు తెరవడానికి వీలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మాస్ కాపీయింగ్,మాల్ ప్రాక్టీస్ వంటి పాల్పడుకుండా పరీక్ష నిర్వాహకులు,అధికారులు సమన్వయంతో పటిష్టంగా విధులు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సూచించారు.





# సాటి నటుడి పట్ల మరో నటుడి సహానుభూతి!

**నటుడు నూతన్‌ప్రసాద్ ఒకసారి బెంగళూరులో షూటింగ్ చేస్తున్నారు. తర్వాత రోజు చెన్నైలో షూటింగ్ ఉంది. తప్పకుండా వెళ్లి తీరాలి. ఫ్లైట్ టికెట్ కోసం ఎంత ప్రయత్నించినా దొరకడం లేదు. ఇక కారులో వెళ్లక తప్పదని ఆయన అనుకున్నారు. సరిగ్గా మరో గంటలో ఫ్లైట్ ఉందనగా, ఆయనకు టికెట్ దొరికిందనే వార్త వచ్చింది. హడావిడిగా సామాన్లు తీసుకుని, ఎయిర్‌పోర్టుకు వెళ్లి విమానం ఎక్కారు.**

విమానంలో ఆయన సీటు పక్కనే భార్యాభర్తలు, వారి ఒడిలో ఓ చిన్నపిల్లాడు ఉన్నారు. వాళ్లని చూడగానే నూతన్‌ప్రసాద్ గుర్తుపట్టారు. ఆయన సీనియర్ హీరో, కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్, ఆయన భార్య పార్వతమ్మ, వాళ్ల ఒడిలో మనవడు. వారికి నమస్కరించి, పక్కన కూర్చున్నారు నూతన్‌ప్రసాద్. కాసేపయ్యాక రాజ్‌కుమార్ ఆయనతో మాట్లాడారు. 'బెంగళూరు నుంచి ఎవరో నటుడు చెన్నైకి వెళ్లాలని అన్నారు. అందుకే నా మనవడి కోసం బుక్ చేసిన టికెట్‌ని అడ్జెస్ట్ చేసి, వాణ్ని నా ఒడిలో కూర్చోబెట్టుకున్నాను' అన్నారాయన. నూతన్‌ప్రసాద్ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. 'నటుడిగా మరో నటుడి అవసరం నాకు తెలుసు. ఒక్క రోజు షూటింగ్ మిస్ అయితే నిర్మాత ఎంత నష్టపోతాడో కూడా తెలుసు. అందుకే ఈ సర్దుబాటు' అని రాజ్‌కుమార్ అన్నారు. ఆ తర్వాత నూతన్‌ప్రసాద్, రాజ్‌కుమార్ మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. 1989లో 'బామ్మ మాట బంగారు బాట' సినిమా షూటింగ్‌లో కారు ప్రమాదం కారణంగా నూతన్‌ప్రసాద్ కాళ్లు పనిచేయని స్థితికి వచ్చాయి. ఆ సమయంలో ఆయన్ని చెన్నైలోని విజయా హాస్పిటల్లో ఉంచారు. అదే టైంలో రాజ్‌కుమార్ కుమారుడు, హీరో శివరాజ్‌కుమార్ కాలికి ఫ్రాక్చర్ కావడంతో ఆయనకు కూడా అదే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆయన్ని చూసుకునేందుకు రాజ్‌కుమార్, పార్వతమ్మ దంపతులు అక్కడికి వచ్చారు. పక్క రూమ్‌లోనే ఉన్న నూతన్‌ప్రసాద్ గురించి తెలుసుకున్న రాజ్‌కుమార్ వెళ్లి, ఆయన్ని పలకరించి ధైర్యం చెప్పారు.

ఒకరోజు సాయంత్రం రాజ్‌కుమార్ నూతన్‌ప్రసాద్ గదికి వచ్చినప్పుడు ఆయన భార్య ఆయన కాలికి తైలంతో మర్దనా చేస్తూ కనిపించారు. 'అలా కాదమ్మా.. ఇలా' అంటూ ఆమె చేతిలో తైలాన్ని తీసుకుని రాజ్‌కుమార్ తనే నూతన్‌ప్రసాద్ కాళ్లు పట్టుకుని తైలం రాశారు. ఆ పనికి నూతన్‌ప్రసాద్ చాలా ఇబ్బంది పడి, 'సార్..సార్..వయసులో, అనుభవంలో మీరు చాలా పెద్దవారు. మీరు నా కాళ్లు పట్టుకోవడం ఏమిటి? బాగుండదు' అన్నారు.

దానికి రాజ్‌కుమార్ నవ్వుతూ 'మీరు కళాకారులు. కళాకారుల్లో పెద్దా, చిన్నా అనే తేడా ఉండదు. కళాకారుడికి సేవ చేయడం నా బాధ్యత. నాకేమీ ఇబ్బంది లేదు' అన్నారు. ఆ తర్వాత 20 రోజుల పాటు రోజూ సాయంత్రం వచ్చి, నూతన్‌ప్రసాద్ కాళ్లకు మర్దనా చేసి వెళ్లేవారు. ఆయన మరణించేవరకూ నూతన్‌ప్రసాద్‌తో ఎంతో స్నేహంగా ఉండేవారు. నూతన్‌ప్రసాద్ మళ్లీ లేచి, నడవగలిగితే మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయంలో పొర్లు దండాలు పెడతానని కూడా రాజ్‌కుమార్ మొక్కుకున్నారు. కానీ అది నెరవేరలేదు.

– విశీ
(వి.సాయివంశీ)

## శ్రీదేవిలా నటించాలనుంది!



అతిలోక సుందరి శ్రీదేవికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎంతోమంది సెలబ్రిటీలు సైతం ఆమెను అభిమానిస్తుంటారు. రీసెంట్‌గా ఓ ఫ్యాషన్ టూర్‌లో పాల్గొన్న తమన్నా భాటియాకు ఓ ప్రశ్న ఎదురైంది. ఆన్‌స్క్రీన్‌పై ఎలాంటి తరహా పాత్రలు పోషించాలనుంది అని అడిగినప్పుడు తమన్నా క్షణం ఆలోచించకుండా వెంటనే శ్రీదేవి పేరు చెప్పింది. శ్రీదేవి 2018లో దురదృష్టవశాత్తూ బాత్ టబ్ లో పడి నీటిలో మునిగి చనిపోయిన విషయం తెలిసిందే. శ్రీదేవిపై తమన్నా తన అభిమానాన్ని ఈ ఈవెంట్ లో వెల్లడించింది. శ్రీదేవి సూపర్ ఐకానిక్ అని, ఆన్ స్క్రీన్ శ్రీదేవిగా నటించాలని కోరుకుంటున్నట్టు తమన్నా తెలిపింది. శ్రీదేవి మేడమ్‌ను ఆరాధించే వ్యక్తుల్లో తాను కూడా ఒకరని తమన్నా ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. స్టీరియోటైప్ పాత్రల నుంచి కామెడీ, డ్రామా వరకు ఎన్నో జానర్లలో పలు విభిన్న పాత్రలను పోషించి ఇండియన్ సినీ హిస్టరీలోనే మొదటి మహిళా సూపర్ స్టార్ గా శ్రీదేవి గుర్తింపు పొందారని తమన్నా చెప్పింది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో శ్రీదేవి 50 సంవత్సరాలకు పైగా వివిధరంగాల్లో కొనసాగారని, మిస్టర్ ఇండియా, సద్మా, హిమ్మత్‌వాలా, ఖుదాగవా, లాడ్లా, ఇంగ్లీష్ వింగ్లీష్, మామ్ లాంటి గుర్తుండిపోయే సినిమాల్లో శ్రీదేవి నటించారని తమన్నా తెలిపింది. ఇక తమన్నా విషయానికొస్తే అమ్మడు ఆఖరిగా నీరజ్ పాండే దర్శకత్వంలో వచ్చిన సికిందర్ కా ముఖద్దర్ సినిమాలో నటించింది. ఈ సినిమాలో జిమ్మీ షీర్ గిల్, అవినాష్ తివారీ, రాజీవ్ మెహతా మరియు దివ్య దత్తా కీలక పాత్రల్లో నటించారు. ప్రస్తుతం తమన్నా తెలుగులో చేస్తున్న ఓదెల2 త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అశోక్ తేజ దర్శకత్వంలో వస్తున్న ఓదెల2ను సంపత్ నంది కథ అందిస్తూ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తమన్నా నాగ సాధువుగా కనిపించనుంది. ఓదెల2 పై తమన్నా చాలానే ఆశలు పెట్టుకుంది. దానికి తగ్గట్టే రీసెంట్ గా రిలీజైన ఓదెల2 టీజర్ కూడా సినిమాపై అంచనాల్ని పెంచింది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

## షెడ్యూల్ కులాల విభజన రాజ్యాంగ విరుద్ధం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

షెడ్యూల్ కులాల విభజన రాజ్యాంగ విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షులు బెంజిమెన్ అన్నారు. నగరంలోని ఇలిసిపురం వద్ద ఉన్న అంబేద్కర్ భవనంలో విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ విభజనను అడ్డం పెట్టుకొని పాలకులు లబ్ది పొందాలని చూస్తున్నారని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లోనూ అదే పంథా కొనసాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణాలోనూ షెడ్యూల్ కులాలను విడదీసి లబ్ది పొందాలని కాంగ్రెస్, బీజేపీ చూస్తోందని ఇది తగదని హెచ్చరించారు. తెలంగాణాల్లో 32లక్షల మంది మాదిగలు ఉన్నారని, వారికి లబ్ధిని చేకూర్చే విధంగా ఈ విభజన జరుగుతోందన్నారు. అందుకే తొమ్మిది శాతం మాదిగలకే కేటాయించారని వివరించారు. ఇది సుప్రీంకోర్టు తీర్పుకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. గతంలో తెలంగాణాలో మందకృష్ణ మాదిగ ఏవిధంగా చేశారో ఇక్కడ కూడా చంద్రబాబునాయుడును కలిసి మాదిగలకు లబ్ది చేకూర్చేలా కృష్ణమాదిగ చేస్తున్నారని పేర్కొన్నారు. పారిశ్రామికరణ పేరుతో దళితుల భూములను తీసుకొని సెంటు భూమి కూడా వారికి ప్రభుత్వం ఇవ్వలేదని తెలిపారు. ఉపాధి లేక భూమి లేక వేలాది మంది యువత వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో దళిత నాయకులు కె రాజులు, కె తవిటయ్య, డి గోవింద్, కె అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారంగా అర్హులైన పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు పేద ప్రజలకు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ సెల్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 10నెలలు కావస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేద ప్రజలకు ఇల్లు స్థలాలు ఇవ్వలేదన్నారు. వెంటనే అర్హులైన ప్రజలకు ఇల్లు స్థలాలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా ఇల్లు నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. ఇల్లు, ఇల్లు స్థలాలు లేక జిల్లాలో అనేక మంది పేద ప్రజలు అద్దె ఇళ్లల్లో బ్రతుకుతూ చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, కొన్న శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు అరవింద్, మధు, క్రాంతి పేద ప్రజలు పాల్గొన్నారు.




# 18న సర్వసభ్య సమావేశం

- బి పెన్షన్ అప్డేషన్ చేయాలి
- డియ్యేను కామెంట్ చేయాలని డిమాండ్
- బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం
- ఎస్ బిఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ అధ్యక్షులు రామచంద్రరావు



(శ్రీకాకుళం)

ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ నాలుగో సర్వసభ్య సమావేశం ఈనెల 18న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షులు కె.రామచంద్రరావు అన్నారు. నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో సోమవారం ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్‌ను నిర్వహించారు. 2017లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెండు విభాగాలుగా ఎస్బిఐ ఇండియా హైదరాబాద్, అమరావతి సర్కిల్‌గా విభజించారన్నారు. 2022లో గుంటూరులో ఎస్‌బీఐ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ ఏర్పడిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మూడుచోట్ల సర్వసభ్య సమావేశం నిర్వహించామని నాలుగో సర్వసభ్య సమావేశం శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10,500 మంది జనాభాతో పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ అతిపెద్ద సభ్యత్వం కలిగిన పెన్షనర్స్ యూనియన్‌గా దేశంలోనే నెంబర్‌వన్ మన అసోసియేషన్ ఉందని వివరించారు. వైద్య సదుపాయాలు అందజేయడంలో, ఇన్సూరెన్స్ ఇవ్వడంలో అమరావతి సర్కిల్ శ్రీకాకుళం మొదటి స్థానంలో ఉందన్నారు. ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగులకు అత్యధిక పెన్షన్ అందుతుందని అనుకోవడం అపోహ మాత్రమేనని వెల్లడించారు. ఏ ద్వైపాక్షికంలో రిటైర్ అయితే ఆ విధంగానే పెన్షన్ అందజేస్తున్నారని తెలిపారు. పెన్షన్ అప్డేషన్ చేయాలని డీఏ నో కామెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 27, 28 తేదీల్లో చేపట్టనున్న బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు తాము సంఘీభావం తెలుపుతున్నామని పేర్కొన్నారు. వార్షికోత్సవ సమయంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. రిటైర్డ్ ఎస్‌బీఐ పెన్షనర్స్ తరపున రెడ్‌క్రాస్‌కు ఫ్రిజ్‌ను అందజేశామన్నారు. అదేవిధంగా ప్రశాంతి వృద్ధాశ్రమంలో 8 మంచాలను అందించామన్నారు. గత ఐదేళ్లలో పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ చేయడంలో శ్రీకాకుళం నంబర్ వన్‌గా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పీఎస్వీఎస్ శర్మ, డీజీఎస్‌సీహెచ్ వెంకటేశ్వరరావు, సర్కిల్ ఉపాధ్యక్షులు బాపయ్య పంతులు, ఏజీఎస్ శశిభూషణ్ రాజు, చైర్మన్ కోటేశ్వరరావు, వీఎస్పీ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల నిరసన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


మామిడిపల్లి సచివాలయం వద్ద ఉపాధి హామీ కూలీలు, జీడిపంట రైతులు తమ డిమాండ్ల కొరకు సోమవారం నిరసన తెలిపారు. జీడి పంటకు గిట్టుబాటు ధర గ్యారెంటీ చేయాలని, 80 కేజీల బస్తాకు రూ. 16 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులకు ఏడాదిలో 100రోజులు పని కనీసంగా ఉండాలని, రోజుకు రూ. 400లు కూలీ రూపంలో చెల్లించాలన్నారు. మెటీరియల్స్ కూడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం సచివాలయం అధికారుల ద్వారా తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నియోజకవర్గంలోని గుడ్ల తారక రామారావుకు రూ. 4లక్షలు, బనిశెట్టి సత్యారావుకు రూ. 1,18,481లు, పోరా అప్పారావుకు రూ. 46,666లు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులు సోమవారం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల అభ్యున్నతి వారికి సహాయం చేయడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆదుకునే విధంగా చెక్కుల పంపిణీ చేస్తున్నామన్నారు. పేదవారికి నాణ్యమైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గార మాజీ మండల పార్టీ అధ్యక్షులు గొండు వెంకటరమణమూర్తి టిఎన్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి గిరిజా శంకర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# మానవాళియోగమే మెహర్‌బాబా లక్ష్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మానవ రూపంలో ఉన్న భగవంతుడు అవతార్ మెహర్‌బాబా అని శ్రీకాకుళం మెహర్‌బాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ సామాజిక సేవకులు గుడ్ల సత్యనారాయణ అన్నారు. మానవాళి మనుగడకు మౌనమే సరైన మార్గమని నమ్మిన వ్యక్తి మెహర్‌బాబా అని కొనియాడారు. భగవంతుణ్ణి ఆరాధించాలంటే మౌనమే సరైన మార్గం అని మెహర్ బాబా భావించి ఎన్నోఏళ్లుగా మౌనదీక్షలో ఉన్నారని చెప్పారు. సోమవారం శ్రీకాకుళం నగరంలో బెహరా మనో వికాసకేంద్రంలో మానసిక వికలాంగుల సమక్షంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గుడ్ల సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముందుగా మానసిక వికలాంగుల మధ్యలో మెహర్‌బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఆనందంగా ఉండాలని అందులో మనం ఉండాలనే విషయాన్ని గుర్తు చేసిన మెహర్‌బాబా ఈ యుగంలో మానవరూపంలో అవతరించిన భగవంతుడని కొనియాడారు. భారతీయ ఆధ్యాత్మక గురువు మెహర్ బాబా అని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అందుకు ప్రతీ ఒక్కరూ ప్రేమతో మెలగాలని, దేవాలయాలకు వెళ్లి పూజలు అభిషేకాలు అర్చనలు చేస్తే మానసిక ప్రశాంతత రాదని అందర్నీ ప్రేమతో చూడాలన్నారు. అందరి అభిమానాన్ని పొందాలని, సామాజిక సేవా కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బెహరా మనో వికాస కేంద్రం అభివృద్ధి పనులకు రూ. 20వేలు ఆర్థిక సహాయాన్ని కమిటీ ప్రతినిధులు శేఖర్‌కు అందించారు. కార్యక్రమంలో కొంక్యాన వేణుగోపాల్, శాసపు జోగినాయుడు, గేదెల ఇందిరాప్రసాద్, గుడ్ల జగ్గారావు, బొడ్డేపల్లి ప్రసాదరావు, ఎం.వాసుదేవ్, గోలీ ఉమా మహేశ్వరరావు, గేదెల లక్ష్మి, వాసంతి, రామ్ బాయ్, ఎండ మోహన్‌లు పాల్గొన్నారు.



## మార్చి 18 నుండి 22వ తేదీ వరకు కంప్యూటర్ శిక్షణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ శాఖల నుండి ఇద్దరు లేదా ముగ్గురుకి మార్చి 18 నుండి 22 వరకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల నుండి ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేసి సత్వరమే అందజేయాలన్నారు. కంప్యూటర్ శిక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటిలిన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఎక్సెల్ షీట్స్, అడ్వాన్స్ టూల్స్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18, 19 తేదీల్లో కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి, జిల్లా కేంద్రంలో ఉన్న ఆయా శాఖల సిబ్బందికి కలిపి 100 మంది ఉద్యోగులకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కంప్యూటర్ శిక్షణ ఉంటుందని తెలిపారు. మార్చి 20వ తేదీన టెక్కలి డివిజన్ కేంద్రంలో 40 మందికి, మార్చి 21వ తేదీన పలాస డివిజన్ కేంద్రంలో 30 మందికి, మార్చి 22వ తేదీన శ్రీకాకుళం డివిజన్ కేంద్రంలో 30 మంది ఉద్యోగులకు శిక్షణ ఉంటుందని ఆయన వివరించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.





మండలంలో పలు గ్రామాల్లో మండల ప్రజా పరిషత్ నిధుల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు చేపట్టారు. అందులో భాగంగా వాటికి శంకుస్థాపనలు, కొత్త కొత్తూరు గ్రామంలో స్మశానానికి సీసీ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మండలంలోని పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నామని లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో లోతుగెడ్డ తాతబాబు, కొయిలాపు సంజీవ రావు,రేగేటి టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, కొత్తూరు

ప్రతివారం జరిగే వారపు సంతను ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ ఉత్పత్తులైన కొండచీపుర్ల అమ్మకాల రేట్లను గిరిజనుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అటవీ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు చేయాలని జీసీసీ మేనేజర్లను పీవో ఆదేశించారు. గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించుటకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పీవో అన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ మేనేజర్లు కృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్ సీతంపేట



# పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు భద్రత



(సత్యంన్యూస్, లావేరు)

శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద సంబంధింత పోలీసు స్టేషన్ పోలీసులు జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపిఎస్ గారు అదేశాల మేరకు పటిష్ట బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. డిఎస్పీలు, సీఐలు వారి వారి పరిధిలో గల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు వ్రాసే విద్యార్థులు, పరీక్షల నిర్వహణ ఆయా స్కూళ్ల సిబ్బంది మినహా ఎవర్నీ ఆ పరిసర ప్రాంతాల్లోకి రాకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లే విద్యార్థులను క్యూ లైన్లో క్రమ పద్ధతిలో అనుమతిస్తు సెల్ఫోన్లు,స్మార్ట్ చేతి గడియారాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, ప్రత్యేక పోలీసు బృందాలచే పరీక్షా కేంద్రాల వద్ద పెట్రోలింగ్ చేపట్టడం, పరీక్ష కేంద్రాల సమీప ప్రాంతాల్లో పరీక్షలు ముగిసేంతవరకు జిరాక్స, ఇంటర్నెట్, ప్రింటింగ్ సెంటర్లు మూసివేయడం చర్యలు చేపట్టారు.పరీక్షలు సజావుగా, సాఫీగా జరగడానికి పరీక్ష కేంద్రంలో విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

## ఘనంగా తెరవే కవిసమ్మేళనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగు రచయితల వేదిక కవులచే తెరవే 102 వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం స్థానిక శాంతినికేతన్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ కోమలరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న 14మంది కవులు సామాజిక పరమైన పలు కవితలను, పద్యాలను చదివి వినిపించారు. కవిసమ్మేళనంలో కవులు, ఐ.పాపయ్య(విశ్వసమాజం), ఐ.యన్.డి ప్రసాద్(చీపురుకట్ట), పి.వి.దుర్గాప్రసాద్(వారెవ్వా ఘనుడు), కుప్పిలి త్రినాథరావు(ఆరోగ్యమస్తు), యల్.సత్యానందం(అక్షరమే సర్వస్వం), వి.రాజారావు(అమరజీవి), తోట గోపాలరావు(మహిళా మణులు), యు.నాగేశ్వరరావు(పరమేశ్వరుడు) ఆర్.వి.రమణ మూర్తి(స్వర్ణ ఆంధ్రప్రదేశ్), డా.కోమలరావు(త్యాగధనుడు), బి.మోహన్ గాంధీ(ప్రత్యక్ష దైవం), కె.బి.రవికిరణ్(ఆదర్శ మహిళ), కిల్లాన శ్రీనివాసరావు(మహిళలు– మహారాణులు), బి.జగన్నాథరావు (మానవీ యత) తదితరులు పాల్గొని కవితాపఠనం చేసారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

### సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ బృందానికి

# ఘన స్వాగతం

- 9 రాష్ట్రాల్లో 25 రోజుల పాటు పర్యటన
- 100 మంది సభ్యులతో 6553 కిలోమీటర్లు ర్యాలీ
- 31న కన్యాకుమారిలో ముగింపు



(సత్యంన్యూస్, రణస్థలం)

సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ ర్యాలీ బృందానికి రణస్థలంలో ఘన స్వాగతం లభించింది. సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పే, డిప్యూటీ కమాన్డెంట్ వినీత్ కుమార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో 80మంది సభ్యులు సోమవారం ఉదయం 9 గంటలకు రణస్థలం తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తహశీల్దార్ ఎన్.ప్రసాదరావు ఆధ్వర్యంలో వీరికి ఘనంగా స్వాగతం పలికారు. కుంకుమ దిద్ది, హారతి ఇచ్చి పూలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. సీఐ అవతారం నేతృత్వంలో వీరికి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అల్పాహారం అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఏకే సింగ్, అమిత్‌కుమార్, ఏకే మహాపాత్రో, షికార్ లోహియా, శ్రీనివాస్ విద్యార్థులకు, యువతకు సీఐఎస్ఎఫ్ విధులు వివరించారు. పశ్చిమబెంగాల్ బకేలి నుంచి ఒక బృందం, గుజరాత్ లఖపథ్ నుంచి ఒక బృందం సైకిల్ ర్యాలీ ప్రారంభించాయని, పశ్చిమ బెంగాల్‌కు చెందిన బృందం 9 రాష్ట్రాల్లో 25 రోజుల పాటు పర్యటిస్తుందన్నారు. 100 మంది సభ్యులతో 6553 కిలోమీటర్లు ర్యాలీ చేపట్టి మార్చి 31న కన్యాకుమారిలో ముగిస్తామని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా నిషేధం, అక్రమ ఆయుధాల నివారణ, తీవ్రవాదుల చొరబాటు నియంత్రణ, తీరప్రాంత భద్రత, మహిళా సాధికారత కోసం సీఐఎస్ఎఫ్ కృషి చేస్తుందన్నారు. సమృద్ధ్ సంరక్షణ పేరుతో చేపట్టిన సైకిల్ ర్యాలీ ద్వారా తీరప్రాంత ప్రజల్లో, దేశ భద్రత సమైక్యతను పెంపొందిస్తూ, మన దేశ, రాష్ట్ర, జిల్లా ప్రజల్ని భద్రతా సిబ్బందితో మమేకం చేస్తున్నమని తెలిపారు. భారతీయ యువతను దేశ భద్రతలో భాగం చేయడంతో పాటు మన దేశ ఆర్థిక అభివృద్ధి, రక్షణలో మన సైనికుల నిబద్ధత, అకుంఠిత దీక్షను విద్యార్థులు, ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాటుచేసిన వీడియోలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.చిరంజీవి, ఏ.ఎస్.ఐ. రమణమూర్తి, తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది, స్థానిక నేతలు, వీఆర్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.




# 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

**- ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ పురుషోత్తంనాయుడు -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పన్నెండో పీఆర్సీ కమిషన్ ఏర్పాటుచేసి పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ ఎన్జీజీవోస్ పూర్వ అధ్యక్షులు, ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ చౌదరి పురుషోత్తంనాయుడు కోరారు. సోమవారం జెడ్పీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలువురు జిల్లా ప్రతినిధులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ జులై 2023 నుంచి పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయవలసివున్నా ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పీఆర్సీ కమిషన్ ఏర్పాటుచేసి కమిషనర్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ప్రభుత్వం పెన్షనర్లకు అన్నిరకాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. కొందరు పెన్షర్లకు ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందడం లేదని, కొందరైతే ఆ ప్రయోజనాలు తీసుకోకుండానే మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీతో తగ్గించిన అదనపు క్వాంటం పెన్షన్‌ను పూర్వ పద్ధతిలో 70 ఏళ్లకు 10 శాతం, 75 ఏళ్లకు 15 శాతం పునరుద్ధరించాలని కోరారు. పెన్షనర్లకు హెల్త్‌కార్డుపై వైద్యం అందించడనికి ఆసుపత్రి యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్‌పై మాత్రమే చేస్తామని చెబుతున్నారని, ఆర్థిక వెసులుబాటు లేక చాలామంది వైద్యం చేయించుకోలేక పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చర్యలుతీసుకొని కార్డుపై క్యాష్‌లెస్ వైద్యం పూర్తిస్థాయిలో అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బి.మల్లేశ్వరరావు, అధ్యక్షులు కె.సోమసుందరరావు, ప్రధాన కార్యదర్శి బిఎస్ ప్రసాదరావు, కోశాధికారి కె.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# రాజధాని చేరిన ఐటీడీఏ ఉద్యమం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్న ఉద్యమం రాష్ట్ర రాజధాని విజయవాడకు చేరుకుంది. జిల్లా విభజన తర్వాత సీతంపేటలో ఉన్న ఐటీడీఏ కార్యాలయం పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోవడంతో మెళియాపుట్టి కేంద్రంగా కొత్త ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్న నినాదంతో రాష్ట్ర ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో ధర్నా చేపట్టారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి నేతృత్వంలో జిల్లా విభజన తర్వాత సీతంపేట, జిల్లా కలెక్టరేట్‌లతో పాటు అనేకచోట్ల నిరసన కార్యక్రమాలు తెలిపినా, మంత్రులకు, అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా ఇంతవరకు శ్రీకాకుళం జిల్లాకు ఐటీడీఏ కార్యాలయంపై హామీ రాకపోవడంతో రాష్ట్ర రాజధానికే నిరసన సెగను పాకించారు. జిల్లాల విభజన తర్వాత 16 మండలాల్లో ఆదివాసీ జనాభా 2లక్షలకు పైగా ఉండగా, అటువంటి చోట ఐటీడీఏ లేకపోవడాన్ని వీరు మొదట్నుంచీ నిరసిస్తున్నారు. ఐటీడీఏ ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదివాసీలకు ప్రత్యేకమైన నిధులు మంజూరవుతాయి. అలాగే వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీ ద్వారా విత్తనాలు, స్పెషల్ డీఎస్సీతో పాటు మెరుగైన వైద్యం, ఆదివాసీ గ్రామాలకు రోడ్ల సదుపాయం, ఉన్నత విద్యకు కోచింగ్ సెంటర్లు, ఆదివాసీ మహిళల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, పోడు వ్యవసాయం చేసుకున్నవారికి ఐటీడీఏ ద్వారా పట్టాలు, సబ్సిడీతో ఎరువులు, మొక్కలు సరఫరా, వైద్యం కోసం ప్రత్యేక కాల్ సెంటర్లు వస్తాయి. అందుకే విభజిత శ్రీకాకుళంలో మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ కార్యాలయం ఏర్పాటుచేయాలని ఉద్యమిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఐటీడీఏ పరిధిలో 40 ఆశ్రమ పాఠశాలలు, 70 జీపీఎస్ పాఠశాలలు, ఏపీఆర్‌జేసీ, మినీ గురుకులాలు ఉన్నాయి. చదువుకున్న విద్యార్థులకు ఐటీడీఏ పరిధిలో ఉన్న జీసీసీ ద్వారా ఆహార దినుసులు సరఫరా చేస్తున్నారు. ఇన్ని లాభాలున్న ఐటీడీఏను ఇంతవరకు శ్రీకాకుళంలో ఏర్పాటు చేయకపోవడంపై స్థానికంగా నిరసనలు తెలియజేస్తే అమరావతి వర్గాలకు చేరడంలేదని, విజయవాడలోనే ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు అవుతున్నందున మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటుకు తీర్మాణం చేయాలని వీరు పట్టుపడుతున్నారు. అలాగే బోయ, వాల్మీకులు, వడ్డి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దంటూ విజయవాడలో ర్యాలీ నిర్వహించారు. విజయవాడ రైల్వేస్టేషన్ దగ్గర్నుంచి ధర్నాచౌక్ వరకు జరిగిన ఈ ర్యాలీకి సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ అధికార ప్రతినిధి పి.ప్రసాద్ సంఘీభావం ప్రకటించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లాల విభజన సమయంలో ప్రజల అభిప్రాయం పరిగణలోకి తీసుకోలేదని, ఐటీడీఏ కార్యాలయం ఒకవైపు, ఆదివాసీలు ఒకవైపు మిగిలిపోయారని ఆయన అన్నారు. అలాగే ఆదివాసీ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో బెంతు ఒరియాలు లేరని, ఇప్పుడు ఎస్టీ సర్టిఫికెట్ తీసుకున్న బెంతుఒరియాలు బీసీ-ఎ కేటగిరీకి చెందినవారని, ఇదే విషయాన్ని గిరిజన సాంస్కృతిక సంప్రదాయాల, ఆచారాల, వ్యవహారాల అధ్యయన కమిటీ సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని ఆయన అన్నారు. జిల్లా నుంచి ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, గౌతు శిరీష, కూన రవికుమార్‌లు జిల్లాకు ఐటీడీఏ కావాలని గళమెత్తుతున్నారని, మిగిలినవారు కూడా ఐకమత్యంగా ఐటీడీఏ కోసం పోరాడాలని వాబ యోగి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎంఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు, సర్పంచ్‌లు జమ్మయ్య, భాస్కరరావు, పాపారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు గణేష్, శ్రీను, మన్మథరావు, సూరపునాయుడు, సోమేష్, ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు.

# మురుగుతో రాగోలు వాసులు సావాసం

- మురికి నీటి కోసం గుంత ఏర్పాటు
- అవస్థలు పాలవుతున్న స్థానికులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

దశాబ్ధ కాలంగా కాలనీలో మురుగు నీరు నిలిచి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకొనే నాధుడే కరువయ్యాడు. శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు శివసాయి కాలనీవాసులు మురుగునీటితో సావాసం చేస్తున్నా పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. శ్రీకాకుళం రూరల్ మండలంలో రాగోలు ప్రధాన వాణిజ్య కేంద్రంగా మారిపోయింది. శ్రీకాకుళం నగరానికి అతి సమీపంలో ఉండడంతో రాగోలు శరవేగంగా అభివృద్ధి పథంలో పయణిస్తుంది. అందుకు తగ్గట్టుగా రాగోలు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. రాగోలు గ్రామంలో మురికి కాలువలకు ఔట్‌లెట్ లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని స్థానికుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు బొణిగి భాస్కర రావు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు దొడ్ల అవుట్‌లెట్లను కొంతమంది మురికి కాలువలకు అనుసంధానం చేయడం వల్ల సమస్య మరింత జఠిలంగా మారిందని ఆయన ఆరోపించారు. మురికి కాలువ ఔట్‌లెట్ లేకపోవడంతో పంచాయతీ అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు కలిసి గ్రామంలోని ఈశ్వరాయలం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో పెద్ద గుంత తవ్వి అందులోకి రాగోలు గ్రామస్తులు వినియోగిస్తున్న వాడుక, మురుగునీటిని పంపించి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేసవి, వర్షాకాలం తేడా లేకుండా నిత్యం ఆ గుంతలో నీరు నిలిచి దుర్వాసనభరితంగా మారినట్టు భాస్కరరావు తెలిపారు. వర్షాకాలంలో ఈ గుంతలో మురుగుతో పాటు వరదనీరు చేరడంతో శివసాయి కాలనీలోని ఆవాసాలన్నీ నీటిలో మునిగే పరిస్థితి దాపురించిందని స్థానికులు చెబుతున్నారు. ప్రతి ఏడాది ఈ సమస్య ఎదురువుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనధికారికంగా తవ్వి మురుగు నీటిని నిల్వ చేయడం వల్ల సమీపంలో ఉన్న శివసాయి కాలనీలో రోడ్డుమీదకు నీరు చేరి స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని భాస్కరరావు సోమవారం ఎంపీడీవో శైలజకు వినతి పత్రం అందించారు.

2013లో రాగోలు పంచాయతీ 7వ వార్డు సభ్యురాలుగా కొనసాగిన బొణిగి వెంకటలక్ష్మి ఈ సమస్యపై పంచాయతీ అధికారులు, స్థానిక సర్పంచ్‌కు విన్నవించినా చర్యలు తీసుకోలేదని భాస్కరరావు తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ ఔట్‌లెట్స్‌ను మురికి కాలువలకు అనుసంధానం చేయడం వల్ల సమస్య మరింత తీవ్రంగా ఉందని భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు స్పందించి మురుగునీరు కాలనీలో ఆవాసాల మధ్య నిల్వ లేకుండా చూడాలని ఎంపీడీవోను కోరారు. మురుగు కాలువలకు ఔట్‌లెట్‌లు ఏర్పాటుచేసి సమస్యకు పరిష్కారం చూపించాలని భాస్కరరావు కోరారు.







# తప్పలతో తిప్పలు.. మళ్లీ సర్వేతో కొత్త తలనొప్పులు

(మొదటిపేజీ తరువాయి)


నుంచి మండలాల్లో నియమించింది. వీరికి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్-1973 (1974లోని కేంద్ర చట్టం) ఏపీ సర్వే అండ్ బౌండరీస్ చట్టం-1923, భూమి, పట్టాదార్ పాస్‌బుక్‌ల్లో ఏపీ హక్కుల చట్టం-1971 కింద అప్పగించబడిన కొన్ని అధికారాలు సంక్రమింపజేశారు. సర్వే, బౌండరీస్ చట్టంలోని సెక్షన్ 26(2)కి సవరణ చేసి నియమాల ప్రకారం అధికారాలను వినియోగించుకోవాలని ప్రభుత్వం 2020 డిసెంబర్ 17న జీవో 378 జారీ చేసింది. సర్వే చేసిన గ్రామంలో భూ సమస్యలన్నీ అప్పీల్స్ రూపంలో అర్జీలు తీసుకుని అర్జీదారులకు 30 రోజుల్లో స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వాలి. అయితే చాలా చోట్ల అప్పీల్స్, స్పీకింగ్ ఆర్డర్స్ లేకుండానే రీసర్వే ప్రక్రియ పూర్తయింది. దీంతో కూటమి ప్రభుత్వం రీసర్వే గ్రామాల్లో గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలను తీసుకోవడం వల్ల భూ వివాదాలు, సమస్యలు వెలుగులోకి వచ్చాయి. రీసర్వేలో గ్రామ రెవెన్యూ అధికారులు సరైన బాధ్యత తీసుకోకపోవడం, లావాదేవీలు జరిగిన భూములు 'మ్యుటేషన్స్' చేయకపోవడం వల్ల భూమి విక్రయించిన రైతు పేరునే కొత్త పాసుపుస్తకాలు జారీచేశారు. భూమి స్వభావం, వర్గీకరణ, భూ యజమానుల పేర్లు, ఫోటోలు, వారి లాగిన్‌లో మాత్రమే చేయాల్సి ఉన్నా ఇప్పటికి ఆ ప్రక్రియ పూర్తి చేయలేదు. చాలామంది గ్రామ రెవెన్యూ అధికారులకు ఈ ప్రక్రియ ఎలా చేయాలో అవగాహన లేకపోవడం ప్రధాన కారణం. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో గ్రామ సరిహద్దులను, ప్రభుత్వ భూములు అన్నీ నిర్ధారించిన తర్వాత మండల స్థాయి సర్వే ఆఫీసర్ 30 శాతం, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ 5 శాతం ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అంతా సక్రమమే అని రూఢీ చేయడం వల్ల రీసర్వే సమస్యలకు ఆజ్యం పోసింది.

**మూడేళ్లలో రీ-సర్వే పూర్తి**

రీ-సర్వే చేసే రాష్ట్రాలకు అప్పులు లేని రుణాలు ఇస్తామని కేంద్రం ప్రకటించిన తర్వాత కూటమి ప్రభుత్వం భూముల సర్వేపై మాట మార్చి పైలెట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామంలో రీ-సర్వే చేస్తామని ప్రకటించి జనవరి 20 నుంచి కార్యచరణ ప్రారంభించింది. దీనికంటే ముందు సర్వేరాళ్లపై జగన్ బొమ్మలను తొలగించే ప్రక్రియను పూర్తి చేసింది. జగన్ బొమ్మతో ముద్రించిన పాస్‌పుస్తకాలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించి వాటి స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో కొత్తవి ఇవ్వడానికి నిర్ణయించింది.

రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రీ-సర్వే పూర్తి చేయనున్నట్టు ఇటీవల శాసనసభలో రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. రీ-సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఎలాంటి హడావిడి లేకుండా భూయజమానులందర్నీ ఒప్పించి ప్రతిష్టాత్మకంగా రీ-సర్వే ప్రాజెక్ట్‌ను మూడేళ్ల సమయంలో పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించారు.

## రామాలయానికి కనకరాజు విరాళం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ బుచ్చిపేట వద్ద రామమందిర పునర్నిర్మాణానికి నగరానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరికతోట కనకరాజు రూ.10వేలు విరాళం అందించారు. ప్రస్తుతం ఉన్న సీతారామ లక్ష్మణ విగ్రహాలకు తోడుగా బాలరాముని విగ్రహాన్ని అయోధ్య మాదిరిగా నెలకొల్పడం, అలాగే విఘ్నేశ్వరుడి మండపాన్ని కూడా ప్రతిష్టించడం వల్ల బుచ్చిపేట రామాలయానికి మరింత ఆధ్యాత్మికత చేకూరిందని కనకరాజు పేర్కొన్నారు.

## ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ధర్నా



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఈ నెల 17 నుంచి 21 వరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో శ్రామిక్ కాంగ్రెసు ప్రకటించిన మేరకు శ్రీకాకుళం రోడ్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్.సి.సాహో, జోనల్ ప్రెసిడెంట్ జై.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం రోడ్డు బ్రాంచ్, నౌపడ బ్రాంచ్ ఇన్‌ఛార్జి మెట్ట అనిల్ చంద్ర, బ్రాంచ్ సెక్రటేరియల్ ఎస్.దంతేశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఏడీఈఎన్ శ్రీకాకుళం రోడ్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కార్మికులకుపై పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం డివిజనల్ రైల్వే మేనేజర్, ఏడియన్ ద్వారా వినతి అందజేశారు. ధర్నాలో శ్రీకాకుళం, నౌపడ బ్రాంచ్ కార్యవర్గసభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.